క్లుప్తంగా

విద్యారంగానికి నిధులు కేటాయించాలి

ఆర్మూర్‌టౌన్: అసెంబ్లీ సమావేశాల్లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని తెలంగాణ నవనిర్మాణ్ విద్యార్థి సేన జిల్లా సంయుక్త కార్యదర్శి వెంకటేశ్ అన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డికి నాయకులు వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో నాయకులు దిలీప్, అరవింద్, కుల్దీప్‌సింగ్, రాము తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



బాల్కొండ: ముప్కాల్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి మహిళలు సోమవారం పాలాభిషేకం చేశారు. రైతులకు రుణమాఫీ ప్రకటించడంపై పార్టీ నాయకులు, మహిళలు హర్షం వ్యక్తం చేశారు. పార్టీ సీనియర్ నాయకుడు ము స్కు మోహన్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సిద్ధుల గుట్టపై ప్రత్యేక పూజలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై ఉన్న శివాలయంలో భక్తులు సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బి సుమన్, పీసీ గంగారెడ్డి, కొడిగెల మల్లయ్య, హజారి సతీశ్, ప్రశాంత్ గౌడ్, చరణ్‌గౌడ్, రవి, సంధ్య, కొంతం మంజుల పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



వేల్పూర్: మండలంలోని పోచంపల్లిలో పలువురు బాధిత కుటుంబాలను కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్ సోమవారం పరామర్శించారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం నర్సారెడ్డి, నాయకులు తదితరులు ఉన్నారు.

పోడు రైతులకు పట్టాలు ఇవ్వాలి



బోధన్: చందూర్ మండలంలోని గ్రామాల్లో పోడు భూమిని సాగు చేస్తూ జీవిస్తున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ పోడు భూముల సాధన కమిటీ, తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీవో రాజేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నన్నేసాబ్, సాయిబాబా, వెంకన్న, హన్మాండ్లు, సాయిలు, శ్రీను, సాయి గంగారాం తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

బాల్కొండ: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని హెచ్ఈ మురళి అన్నారు. వైద్యశాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై సోమవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈవో రాజేశ్వర్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికుల ధర్నా

మాక్లూర్: పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గుత్ప ఎత్తిపోతల పథకం కార్మికులు మండల కేంద్రంలో సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి కొండా గంగాధర్, కార్మికులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ



భీమ్‌గల్: మండలంలోని పలు గ్రామాల లబ్ధిదారులు, బాధితులకు మంజూరైన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులను తహసీల్దార్ శ్రీలత సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బొదిరె స్వామి, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు గోపాల్‌నాయక్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

అశోక్‌కు సన్మానం

వేల్పూర్: హైదరాబాద్‌లో వచ్చేనెల 11న నిర్వహించే తెలంగాణ హిస్టారికల్ 10కె రన్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంపికైన మండల కేంద్రానికి చెందిన మారథాన్ గుగ్గిలం అశోక్‌ను స్థానిక స్టార్ యూత్ సభ్యులు సోమవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మగ్గిడి తిరుపతి, చిన్నారెడ్డి, సంతోష్‌రెడ్డి, సునీల్‌కుమార్, రమేశ్‌రెడ్డి, అనూప్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల వలయంలో సర్కారు బడి

- శిథిలావస్థకు చేరిన పోచంపాడ్ ఉన్నత పాఠశాల
- నిలిచిన అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు
- పట్టించుకోని అధికారులు



అసంపూర్తిగా ఉన్న అదనపు తరగతి గదుల నిర్మాణం

బాల్కొండ : మెండోరా మండలం పోచంపాడ్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. పాఠశాల నిర్మాణం రేకులతో నిర్మించారు. వర్షాకాలం వచ్చిందంటే చాలు విద్యార్థులు బిక్కుబిక్కుమంటు పాఠశాలకు వస్తున్నారు. పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణాలకు గత ప్రభుత్వం కోటి రూపాయల నిధులను మంజూరు చేసింది. కానీ పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. దీంతో విద్యార్థులు శిథిలావస్థకు చేరిన భవనంలోనే చదువులు కొనసాగిస్తున్నారు. పోచంపాడ్ పాఠశాలలో సక్సెస్ పాఠశాలతో పాటు ఉర్దూ మీడియం కూడా కొనసాగుతోంది. పాఠశాల భవనం రేకుల షెడ్డుతో ఉండటంతో మనఊరు–మనబడిలో పాఠశాల భవన నిర్మాణానికి ప్రభుత్వం కోటి రూపాయల నిధులను మంజూరు చేసింది. కానీ పనులు ఆరునెలలు ముందుకు.. ఏడాది వెనక్కు అన్నట్లు సాగుతూ వచ్చాయి. ఎట్టకేలకు స్లాబ్ వరకు, ప్లాస్టరింగ్ పనులు పూర్తయ్యాయి. కానీ ఇంకా కావాల్సిన పనులు ముందుకు సాగడం లేదు. ఎప్పుడు పూర్తవుతాయో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. పాఠశాలలో సుమారు 360 మంది విద్యార్థులు చదువుతున్నారు. పూర్వపు రేకులషెడ్డు భవనంలో సరైన వసతులు లేకపోవడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండు రోజులుగా కురిసిన వర్షాలకు పాఠశాల ఆవరణలో వర్షపు నీరు కుంటలా మారింది. అంతేకాకుండా వర్షంతో తరగతి గదులు ఊరుస్తున్నాయి. శిథిలావస్థలో ఉన్న భవనంలో విద్యార్థులు భయం భయంగా చదువును సాగిస్తున్నారు. పోచంపాడ్ ఉన్నత పాఠశాలలో పోచంపాడ్, సోన్‌పేట్, దూదిగాం విద్యార్థులు చదువుతున్నారు. తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ మీడియంలు కొనసాగుతుండడంతో విద్యార్థులకు తరగతి గదులు కూడా ఎక్కువగానే అవసరం కానున్నాయి. కానీ ఇవి పాలకులు, ఉన్నతాధికారులకు పట్టడం లేదు. సర్కారు బడిలోకి విద్యార్థులను పంపండి అంటు ప్రచారమే తప్ప కనీస వసతుల గురించి పట్టించుకునే నాథుడే లేడని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కనీస వసతులు కరువు

పాఠశాలలో విద్యార్థులకు కనీస వసతులు కరువయ్యాయి. కనీసం మూత్ర శాలలు, మరుగుదొడ్లు సరిగా లేవు. ఉన్న తలుపులు సగం తుప్పుపట్టి పోయాయి. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి భవనం త్వరగా పూర్తయ్యేలా చూడాలని, పాఠశాలలో కనీస వసతులు ఏర్పాటు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.



రేకులషెడ్‌తో నిర్మించిన పోచంపాడ్ పాఠశాల



పాఠశాల ఆవరణలో నిలిచిన వర్షపు నీరు



బాత్‌రూం డోర్‌కు ఏర్పడిన రంధ్రం

ముగిసిన శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న ఇన్‌చార్జి సీడీపీవో జ్యోతి

పెర్కిట్: మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో అంగన్‌వాడీ టీచర్లకు ఈసీసీఈ రివైజ్డ్ ప్రీ స్కూల్ కరిక్యులంపై ఇస్తున్న శిక్షణ తరగతులు సోమవారం ముగిశాయి. బ్యాచ్‌కు 35 మంది చొప్పున తొమ్మిది బ్యాచ్‌లకు మాస్టర్ ట్రైనర్స్‌చే శిక్షణ తరగతులు నిర్వహించారు. జాతీయ నూతన విద్యా విధానంలో భాగంగా పూర్వ ప్రాథమిక విద్యలో వచ్చిన మార్పుల గురించి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి సీడీపీవో జ్యోతి మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యనందించడానికి చిన్నారుల సంఖ్యను పెంచాలని టీచర్లకు సూచించారు. కార్యక్రమంలో మాస్టర్స్ ట్రైనర్స్ శ్రీదేవి, రేఖ, పోషణ్ అభియాన్ జిల్లా సమన్వయకర్త రాంబాబు, విలాస్, సాగర్, సూపర్‌వైజర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతలో కార్మికుల పాత్ర కీలకం



ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధిని శుభ్రంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికుల పాత్ర కీలకమని మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో కార్మికులకు పీపీఈ కిట్లను సోమవారం అందజేశారు. ప్రతి రోజు కార్మికులు విధులు నిర్వహించాలన్నారు. కార్మికులు కార్మిక డ్రెసులు ఇవ్వాలని చైర్‌పర్సన్‌ను కోరగా వారం రోజుల్లో అందజేస్తామన్నారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ షేక్ మున్ను, మున్సిపల్ కమిషనర్ రాజు, కౌన్సిలర్ ఆకుల రాము, జవాన్లు, కార్మికులు పాల్గొన్నారు.

స్మితా సబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలి



బోధన్/ బోధన్‌టౌన్: దివ్యాంగులను కించపర్చే విధంగా ట్విట్టర్‌లో పోస్టు పెట్టిన ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ వికలాంగుల హక్కుల జాతీయ వేదిక మండల ప్రతినిధులు, దివ్యాంగులు బోధన్ ఆర్డీవో కార్యాలయం ఎదుట సోమవారం నిరసన తెలిపారు. అనంతరం ఆర్డీవో రాజేశ్వర్‌కు వినతిపత్రం అందించారు. నాయకులు తదితరులు పాల్గొన్నారు. దివ్యాంగులను కించ పరిచేలా వ్యాఖ్యలు చేసిన స్మితాసబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ డిమాండ్ చేశారు. అనంతరం ఏసీపీ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు.

బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి



పెర్కిట్/ డొంకేశ్వర్/ మాక్లూర్/ వర్ని/ బాల్కొండ/ రుద్రూర్/ ఆర్మూర్/ నవీపేట: సీఎం రేవంత్ రెడ్డి బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని అన్ని మండలాల్లోని తహసీల్ కార్యాలయాల ఎదుట బీజేపీ, ఓబీసీ మోర్చా నాయకులు సోమవారం ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్లకు వినతిపత్రం అందజేశారు. ఆలూర్, డొంకేశ్వర్, మాక్లూర్, వర్ని, మోస్రా, ముప్కాల్, బాల్కొండ, కోటగిరి, పోతంగల్, రుద్రూర్, ఆర్మూర్, నవీపేటలో తహసీల్ కార్యాలయాల ఎదుట బీజేపీ నాయకులు నిరసన తెలిపారు. బీసీ డిక్లరేషన్ చేయాలని డిమాండ్ చేశారు.

లిఫ్ట్ కాలువ గండికి మరమ్మతులు



బాల్కొండ: ఎస్సారెస్పీ నుంచి నీటి సరఫరా చేసే లక్ష్మి ఆధారంగా నిర్మించిన వేంపల్లి ఎత్తిపోతల పథకం కాలువకు రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు గండి ఏర్పడింది. దీంతో నీరు వృథాగా పోతుందని ఆయకట్టు రైతులు అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో సోమవారం గండికి మరమ్మతులు చేపట్టారు. పనులను మైనర్ ఇరిగేషన్ ఏఈఈ శేఖర్‌బాబు పర్యవేక్షించారు. రైతు నాయకుడు బుల్లెట్ రాంరెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతు బీమాకు దరఖాస్తులు చేసుకోవాలి

రుద్రూర్/ కమ్మర్‌పల్లి/ బాల్కొండ: రైతు బీమా పథకానికి అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని కోటగిరి వ్యవసాయాధికారి శ్రీనివాస్‌రావు తెలిపారు. ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోని రైతులు, కొత్తగా జూన్ 28 వరకు పట్టా బుక్ వచ్చిన కొత్త పట్టాదారు రైతులు వచ్చే నెల 5లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను స్థానిక మండల విస్తీర్ణాధికారులకు అందచేయాలని కోరారు. కొత్తగా పట్టా పాస్‌బుక్‌లు పొందిన రైతులు రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని కమ్మర్‌పల్లి మండల వ్యవసాయధికారి అబ్దుల్ మాలిక్ తెలిపారు. బీమా చేసుకున్న రైతులకు మార్పులు, చేర్పులకు అవకాశం ఉందన్నారు. రైతులు సకాలంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రైతు బీమా కోసం రైతులు రైతు వేదికల వద్ద ఏఈవోలకు దరఖాస్తు చేసుకోవాలని బాల్కొండ, ముప్కాల్ మండలాల వ్యవసాయాధికారులు మహేందర్‌రెడ్డి, రాజుకుమార్ వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. దరఖాస్తుతో పట్టాపాస్ బుక్, రైతు ఆధార్ కార్డు, నామిని ఆధార్ కార్డు జిరాక్స్‌లు జతపర్చాలన్నారు.

కార్మికులకు రూ.4016 జీవన భృతి ఇవ్వాలి



ధర్నా నిర్వహిస్తున్న బీడీ కార్మికులు

బోధన్: ఎన్నికల్లో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు బీడీ కార్మికులకు రూ. 4016 జీవనభృతి ఇవ్వాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి మల్లేష్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే అసెంబ్లీని ముట్టడిస్తామన్నారు. సోమవారం పట్టణ కేంద్రంలో యూనియన్ ఆధ్వర్యంలో జీవన భృతి కోసం కార్మికులు ర్యాలీ, ధర్నా చేపట్టారు. అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం అందించారు. నాయకులు పడాల శంకర్, సాయిలు, నాగమణి, పోశెట్టి, గంగామణి, శోభ, బుజ్జి, అనిత, కళావతి, తులసి, పద్మ, గోదావరి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

కలెక్టర్‌కు వినతి

బోధన్‌రూరల్: అమ్దాపూర్‌లోని జెడ్పీహెచ్ఎస్‌లో అదనపు గదుల నిర్మాణం, కేజీబీవీ భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు జిల్లా కేంద్రంలోని ప్రజావాణిలో కలెక్టర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. సిర్ప సుదర్శన్, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల పంపిణీ

బోధన్‌టౌన్: భారత జాతీయ జెండా దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ఆజాంగంజ్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన చిత్ర లేఖనం పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు లయన్స్ క్లబ్ఆఫ్ ఆపెక్స్ వైటల్ ఆధ్వర్యంలో బహుమతులను సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం శ్రీనివాస్, లయన్స్ జోన్ చైర్మన్ లంక రవి, ప్రెసిడెంట్ జెరుషా, హెచ్ఎం శ్రీనివాస్ గౌడ్, ప్రతినిధులు శ్యాంసుందర్ పహాడే, లయన్ నాగభూషణం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అవగాహన

డొంకేశ్వర్: సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై రాహుల్ ప్రజలకు సూచించారు. మండలంలో సైబర్ మోసాలు పెరిగిపోతున్న నేపథ్యంలో నూత్‌పల్లి, మారంపల్లి గ్రామాల్లో సోమవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. గుర్తు తెలియని వ్యక్తులు వాట్సప్‌కాల్ చేస్తే ఎత్తకూడదని, ఓటీపీలు చెప్పకూడదని సూచించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 నంబరుకు ఫిర్యాదు చేయాలన్నారు.

జగన్నాయకునికి ప్రత్యేక పూజలు

భీమ్‌గల్: మండలంలోని పిప్రి శివారులోని కొండల్లో వెలసిన జగన్నాయకునికి సోమవారం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

ఆలయాల హుండీ ఆదాయం లెక్కింపు

బోధన్‌రూరల్: పట్టణంలోని శ్రీచక్రేశ్వర ఆలయం, మారుతి మందిర్‌లో దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు హుండీ ఆదాయాలను సోమవారం లెక్కించారు. చక్రేశ్వర ఆలయంలో 14.03.2024 నుంచి 22.07.2024 వరకు రూ.1,09,421, మారుతి మందిర్‌లో 07.01.2024 నుంచి 22.07.2024 వరకు రూ.31,525లు హుండీ ఆదాయం వచ్చినట్లు ఈవో రవీందర్ గుప్తా పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ కమల, ఈవో రవీందర్, ఆలయ అర్చకులు ప్రవీణ్ మహరాజ్, గణేశ్ మహరాజ్, మహేశ్ పతాక్, మధుసూదన్, జూనియర్ అసిస్టెంట్ రాములు, భక్తులు పాల్గొన్నారు.

ఎంపీవోకు సన్మానం

రుద్రూర్: కోటగిరి ఎంపీడీవోగా విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్తున్న మారుతిని దళిత సంఘం నాయకులు సోమవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మిర్జాపూర్ చిన్న సాయన్న, పాల గంగారాం, దౌలయ్య, సాయిలు, విజయ్, శంకర్, రాములు తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతోనే మనుగడ

రెంజల్/ భీమ్‌గల్: మొక్కల పెంపకంతోనే భవిష్యత్ తరాల మనుగడ ఉంటుందని రెంజల్ ఎంపీడీవో శ్రీనివాస్, ఎస్సై సాయన్న పేర్కొన్నారు. సోమవారం రెంజల్ స్టేషన్ ఆవరణలో వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో కార్యదర్శి రాజేందర్, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. నాటిన మొక్కలను సంరక్షించాలని పంచాయతీ అధికారులను భీమ్‌గల్ ఎంపీడీవో సంతోష్ కుమార్ ఆదేశించారు. మండలంలోని బెజ్జోరా, ముచ్కూర్ గ్రామాలను ఎంపీడీవో సందర్శించి వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. బెజ్జోరాలో అమ్మ ఆదర్శ పాఠశాల పనులపై సమీక్ష చేపట్టారు. కార్యక్రమాల్లో ఎంపీవో గంగామోహన్, ఏపీవో నర్సయ్య, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దాశరథి జయంతి

నందిపేట్: మండల కేంద్రంలో జేఏసీ ఆధ్వర్యంలో దాశరథి కృష్ణమాచార్య జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జేఏసీ గంగన్న, మాజీ ఎంపీటీసీలు సిలిండర్ లింగం, బాలగంగాధర్, మాజీ కో ఆప్షన్ మెంబర్ సయ్యద్ హుస్సేన్, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్లు వచ్చే వరకు అండగా ఉంటా

- ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి

పెర్కిట్: ఆర్మూర్ నియోజకవర్గంలోని పేదలకు ప్రభుత్వం నుంచి ఇండ్లు వచ్చే వరకు అండగా ఉండి పోరాటం చేస్తానని ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని రైతు వేదిక భవనంలో సోమవారం ఆర్మూర్, ఆలూర్ మండలాలకు చెందిన 146 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. బేషజాలకు పోకుండా నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని నాయకులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ప్రభుత్వం, ఉన్నతాధికారులతో చర్చించి ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని టీపీయూఎస్ నాయకులు ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డికి రైతు వేదిక భవనంలో వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందించిన వారిలో జిల్లా అధ్యక్షురాలు పరలి కృష్ణవేణి, ఉపాధ్యక్షుడు నల్లకిషన్ రెడ్డి, దయాసాగర్ తదితరులు ఉన్నారు.

పోస్టల్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న జనార్దన్‌రెడ్డి

వర్ని: ప్రభుత్వం ప్రవేశపెట్టిన పోస్టల్ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్ సీనియర్ సూపరింటెండెంట్ జనార్దన్ రెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని ఓ పాఠశాలలో పోస్టల్ పథకాలపై సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పోస్టల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ సురేఖ, తహసీల్దార్ సాయిలు, ఎస్సై కృష్ణకుమార్, హెచ్ఎం నవీన్, నాయకుడు వీర్రాజు పాల్గొన్నారు.

పాఠశాలల్లో శిక్షా సప్తాహం



పడగల్‌లో టీఎల్ఎంను ప్రదర్శిస్తున్న విద్యార్థులు



కోనాపూర్‌లో విద్యార్థులు

వేల్పూర్: జాతీయ విద్యావిధానం ప్రారంభించి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా మండల ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం శిక్షా సప్తాహ కార్యక్రమం నిర్వహించారు. పడగల్, వేల్పూర్, పచ్చలనడ్కుడ, మోతె, రామన్నపేట్, అంక్సాపూర్, లక్కోర, కుకునూర్ పాఠశాలల్లో టీఎల్ఎం రూపొందించి ప్రదర్శించారు. హెచ్ఎంలు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోనాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో..

కమ్మర్‌పల్లి: మండలంలోని కోనాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో శిక్షా సప్తాహ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు గణిత బోధనలో ఉపయోగపడే వంద రకాల బోధనోపకరణాలు ప్రదర్శించారు. ఎన్‌సీఈఆర్‌టీ న్యూఢిల్లీ ద్వారా పంపిణీ చేసిన గణిత కిట్ పరికరాలతో తయారు చేసిన ఉపకరణాల ద్వారా బీజగణితం, త్రికోణమితి, సంఖ్యాకశాస్త్రం, పలు అంశాలను విద్యార్థులు వివరించారు. హెచ్ఎం చౌడారపు రాంప్రసాద్, ఉపాధ్యాయులు ధర్మేందర్, హైమవతి, గీత విద్యార్థులను అభినందించారు.

కేజీబీవీ డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి

ఆర్మూర్‌టౌన్: పెర్కిట్‌లో ఉన్న కేజీబీవీ వసతి గృహంలో నెలకొన్న డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని పీడీఎస్‌యూ నాయకులు సోమవారం డిమాండ్ చేశారు. అనంతరం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షుడు ఎం నరేందర్, డి నిఖిల్, జంపన్న, భార్గవ్, నితిన్, అఖిల్, శ్రీకాంత్, ముఖేష్, శివ గంగాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి

రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించి, పెండింగ్‌లో ఉన్న రూ. 8213.57 కోట్ల స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ ఆర్మూర్ డివిజన్ అధ్యక్షుడు ప్రిన్స్ డిమాండ్ చేశారు. పట్టణ కార్యాలయంలో నిర్వహించిన డివిజన్ కమిటీ సమావేశంలో మాట్లాడారు. వంశీ, షాబాస్, నిశాంత్ తదితరులు పాల్గొన్నారు.

సమాచారం..

దివ్యాంగులకు బస్‌పాస్‌ల జారీ

రుద్రూర్: దివ్యాంగులు రాయితీ బస్‌పాస్‌లు పొందడానికి వారం రోజుల పాటు మండల బస్టాండ్‌లో ప్రత్యేక కౌంటర్‌ను ఆర్టీసీ సిబ్బంది నిర్వహిస్తున్నారని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షుడు జల్లాపురం సాయిలు వెల్లడించారు. బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన కౌంటర్‌లో బస్‌పాస్ దరఖాస్తులను సోమవారం అందచేశారు. బస్‌పాస్ కోసం వచ్చే దివ్యాంగులు సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డు, ఫొటోతో రావాలని సూచించారు.

24న బస్‌పాస్‌ల పంపిణీ

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో ఈనెల 24 దివ్యాంగులకు ఆర్టీసీ ఆర్మూర్ డిపో మేనేజర్ చేతుల మీదుగా బస్‌పాస్‌లు అందజేయనున్నట్లు ఏపీఎం కుంట గంగాధర్ సోమవారం పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల దివ్యాంగులు పాత బస్‌పాస్, సదరం సర్టిఫికెట్, ఆధార్‌కార్డు జిరాక్స్, నాలుగు ఫొటోలతో ఐకేపీ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

రేపు స్పాట్ అడ్మిషన్లు

రుద్రూర్: మండలంలోని అంబం(ఆర్) శివారులో ఉన్న మోడల్ స్కూల్, కళాశాలలో మిగిలిన సీట్ల భర్తీకి ఈ నెల 24న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఆలూరి నరేందర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్ సీఈసీలో 10, బైపీసీలో 4, ఎంపీసీలో 6, ఆరో తరగతిలో 6, ఎనిమిదవ తరగతిలో 3, 9వతరగతిలో 3 ఖాళీలు ఉన్నాయని వివరించారు. 24న ఉదయం 10 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాఠశాలకు హాజరు కావాలని కోరారు.

బదిలీలు..

మున్సిపల్ అధికారులు..

ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న అధికారులతో పాటు ఇతర ప్రాంతాల్లో డిప్యుటేషన్‌పై విధులు నిర్వహిస్తున్న అధికారులు బదిలీ అయ్యారు. మేనేజర్ జాదవ్‌కృష్ణ ఆదిలాబాద్ మున్సిపల్‌కు, ఆర్‌వో మనోహర్ ఆదిలాబాద్ జిల్లా ఖానాపూర్ మున్సిపల్‌కు, నిజామాబాద్ కార్పొరేషన్‌కు శానిటరీ ఎస్సై మహేశ్, జూనియర్ అసిస్టెంట్లు హేమలత, ప్రసన్నకుమార్, రాజేశ్వరి, బోధన్‌కు బిల్‌కలెక్టర్ సుశీల బదిలీ అయ్యారు.

జీపీ కార్యదర్శులు..

రుద్రూర్: మండలంలోని సిద్ధాపూర్, చిక్కడపల్లి జీపీ కార్యదర్శులు గౌస్, రాధిక బదిలీ అయినట్లు మండల పరిషత్ అధికారులు సోమవారం తెలిపారు. రాధిక వర్ని మండలం అఫంది ఫారం, గౌస్ రుద్రూర్ మండలం చిక్కడపల్లికి బదిలీ అయ్యారు. ఐతే సిద్ధాపూర్ జీపీ కార్యదర్శిగా వర్ని మండలం మల్లారం కార్యదర్శి శ్రీనివాస్ రానున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

- స్క్రీన్-1 – ట్విస్టర్ (హిందీ) – 11.50, 6.40, 9.30; భారతీయుడు-2 (తెలుగు) – 02.45
- స్క్రీన్-2 – కల్కి – 2898 ఏడి (3డీ-తెలుగు) – 11.00, 2.45, 6.30, 10.15
- స్క్రీన్-3 – డార్లింగ్ (తెలుగు) – 11.45, 3.05, 6.25, 9.45
- స్క్రీన్-4 – ది బర్త్‌డే బాయ్ (తెలుగు) – 02.20; క్రైమ్ రీల్ (తెలుగు) – 5.00; పేకమేడలు (తెలుగు) – 7.35; భారతీయుడు-2 (తెలుగు) – 10.15